RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | శనివారం | 22.06.2024

సంపుటి 316 | సంచిక 1 | పేజీలు : 04 | వెల : రూ.5

సిబిఐ ప్రత్యేక కోర్టులో

## కవితకు ఎదురుదెబ్బ

- జులై 5 వరకు కస్టడీ పొడిగిస్తూ సిబిఐ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ



**న్యూఢిల్లీ ప్రభాత సూర్యుడు :** సిబిఐ ప్రత్యేక కోర్టులో ఎంఎల్సి కవితకు ఎదురుదెబ్బ తగిలింది. లిక్కర్ పాలసీ సిబిఐ కేసులో కవితకు జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. నేటితో ఎంఎల్సి కవిత జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు అధికారులు హాజరుపరిచారు. జులై 5వరకు కస్టడీ పొడిగిస్తూ సిబిఐ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కేసులో కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను రౌస్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు జూన్ 21వ తేదీ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. జూన్ 3న ఈడీ అధికారులు వాదనలు పరిగణలోకి తీసుకున్న కోర్టు కవిత జ్యుడీషియల్ కస్టడీని జూలై 3వ తేదీ వరకు పొడిగించిన విషయం విధితమే.

## డీఎస్సీకి భారీగా దరఖాస్తులు




**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన మెగా డీఎస్సీ`2024' దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. జూన్ 20 సాయంత్రం నాటికి 3,02,798 మంది అభ్యర్థులు ఫీజు చెల్లించగా.. ఇందులో 2.84 లక్షల మంది దరఖాస్తులు సమర్పించారు. అభ్యర్థులు దరఖాస్తు ఫీజుగా రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కువ ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలనుకునేవారు, ప్రతి ఉద్యోగం కోసం రూ.1000 అదనంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 'అప్లికేషన్ ఎడిట్' ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు 64,556 మంది అభ్యర్థులు తమ దరఖాస్తులు సవరించుకున్నారు. టెట్ ఫలితాలు విడుదలకావడంతో.. అభ్యర్థులు తమ టెట్ మార్కుల వివరాలు నమోదుచేసుకోవడం, ఇతర వివరాలు మార్చుకోవడానికి అవకాశం కల్పించారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే 9154114982, 6309998812 నంబర్లలలో సంప్రదించవచ్చు. తెలంగాణలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 29న 'మెగా డీఎస్సీ`2024' నోటిఫికేషన్ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థుల నుంచి మార్చి 4 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే ఏప్రిల్ 2తో దరఖాస్తు గడువు ముగియాల్సి ఉండగా.. టెట్ నిర్వహణ తప్పనిసరి అని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు టెట్ నోటిఫికేషన్ వెలువడటంతో దరఖాస్తు గడువును ఏప్రిల్ 2 నుంచి జూన్ 20 వరకు పొడిగించారు. టెట్ ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. గత నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసిన వాళ్లు ఆయా పోస్టులకు మళ్లీ కొత్తగా దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదు. గరిష్ఠ వయోపరిమితిని 46 సంవత్సరాలకు పెంచిన సంగతి తెలిసిందే.



## 'డబ్బుల్' బెడ్ రూమ్

**మహబూబ్ నగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో పనిచేసిన ఓ అధికారి, తమ కార్యాలయ సిబ్బందితో కలిసి లక్షల్లో అవినీతికి పాల్పడ్డట్లు ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఏకంగా సీఎం కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టర్ వద్దకు అవినితీ భాగోతం తీసుకెళ్లడంతో రహస్య విచారణ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్క ఇళ్లు అక్రమంగా కేటాయింపునకు సుమారు రూ.3 లక్షల నుంచి రూ.6లక్షలు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.**

# గోల్ మాల్

### డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులో అధికారుల చేతివాటం

### అధికారుల అవినీతికి ఆసరాగా మారిన నిర్దిష్టమైన ప్రణాళిక నిర్వాహణలోపం

మహబూబ్ నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు, 'డబ్బుల్' బెడ్ రూం ఇళ్లలా మారాయి. ఇళ్ల పంపిణీ అంశంలో నిర్దిష్టమైన ప్రణాళిక అవలంబించకపోవడంతో అధికారుల అవినీతికి ఆసరాగా మారింది. నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి మరీ అమాయక ప్రజలను దోచుకున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా కేటాయించిన ఒక్కో ఇంటికి లక్షల్లో డబ్బులు వసూలు చేశారని ప్రభుత్వానికి ఫిర్యాదుల వెల్లువెత్తుతున్నాయి.

**మహబూబ్ నగర్ - ప్రభాత సూర్యుడు**

మహబూబ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో దివిటిపల్లి, వీరన్నపేట, మౌలాలిగుట్ట, ఏనుగొండ, క్రిస్టియన్ పల్లి ప్రాంతాల్లో లబ్దిదారులకు ఇళ్ల కేటాయింపులు చేశారు. అయితే పంపిణీ విషయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు గత కొన్ని రోజులుగా బలంగా వినిపిస్తున్నాయి. పలువురు దరఖాస్తుదారుల వద్ద డబ్బులు తీసుకొని అధికారులు ఇళ్లు కేటాయించారని ఇప్పటికే ఫిర్యాదులు సైతం అందాయి. ఇందులో నాటి మహబూబ్ నగర్ అర్బన్ తహసిల్దార్, ఆర్ఐ, కార్యాలయ సిబ్బంది మధ్యవర్తిని ఏర్పాటు చేసుకొని ప్రధాన పాత్ర పోషించారని బాధితులు చెబుతున్నారు. ఇక దివిటిపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం లకు ధర ఎక్కువగా నిర్ణయించారు. ఇక్కడ ఇళ్లు అక్రమంగా కేటాయించాలంటే సుమారు రూ.5 లక్షల వరకు వసూలు చేశారని బాధితులు చెబుతున్నారు. వీరన్నపేటలో రూ.4 లక్షలు, మౌలాలిగుట్టలో రూ.3 లక్షలు.. ఇలా ఒక్కో ప్రాంతానికి ఒక్కో ధర ఫిక్స్ చేసి కోరిన చోట్ల ఇళ్ల కేటాయింపులు చేశారని వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలోనే తమకు కూడా అదే పద్ధతిలో కేటాయిస్తామని నమ్మబలికి లక్షల రూపాయలు వసూలు చేశారని చెబుతున్నారు. హాట్ బాక్స్, కవర్లలో నగదును, పార్టీల పేరుతో మందు, కాల్చిన మటన్, బిర్యానీలను తీసుకునే వారని బాధితులు ఆరోపిస్తున్నారు. పట్టా గురించి అడిగితే మాత్రం సమాధానం దాటవేసేవారని వెల్లడించారు. చివరకు ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందని తప్పించుకున్నారని,

మిగతా 2లో

## యోగా విద్యనే కాదు విజ్ఞానం కూడా

**ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ ప్రభాత సూర్యుడు** యోగా అనేది ప్రాచీన విద్యనే కాదు. విజ్ఞానం కూడా అని ప్రధాని మోదీ అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో యోగా డేలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. యోగాకు జమ్మూకశ్మీర్ నిలయం. ప్రపంచంలో యోగా అనేది ఇప్పుడొక కొత్త ట్రెండ్. యోగా గురించి తెలుసుకునేందుకు ఇండియాకు వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది అని తెలిపారు.

# డైలామాలో కేటీఆర్ ఫ్యూచర్



**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫ్యూచర్ డైలమాలో పడింది. అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల్లో అన్నీ తానై వ్యవహరించిన గులాబీ పార్టీ చిన్నబాస్ లోక్‌సభ ఫలితాల తర్వాత పత్తా లేకుండా పోయారు. అసలే సీఎం సీటు దిగాల్సి వచ్చిందన్న బెంగతో కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు రావడం లేదు. ఇటు చూస్తే ఒక్క ఎంపీ స్థానం కూడా దక్కకపోవడంతో కేటీఆర్ పార్టీ శ్రేణులకు నల్లపూస అయిపోయారు. తీహార్ జైలుకు వెళ్లి చెల్లిన చూసొచ్చిన వెంటనే ఆయనకు ఎన్నికల అఫిడవిట్ ఉచ్చు బిగుసుకుంది. వరుస ఓటములతో బీఆర్ఎస్ ఉక్కిరి బిక్కిరి అవుతుంది. మరోవైపు వలసలు గులాబీ పెద్దలకు షాక్‌ల షాక్‌లు ఇస్తున్నాయి. దాంతో పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా తయారైంది.**

### అసెంబ్లీ , లోక్‌సభ ఎన్నికల్లో వరుస పరాభవాలతో బీఆర్ఎస్‌కు ముఖ్యనేతల గుడ్‌బై

మిగతా 2లో

**హైదారాబాద్ - ప్రభాత సూర్యుడు**


ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై సమీక్షలు నిర్వహించి, పార్టీ శ్రేణుల్లో స్థైర్యం నింపాల్సిన భాధ్యత కేటీఆర్‌దే. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కేటీఆరే ఎక్కువ హడావుడి చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడైతే కేసీఆర్ ఢిల్లీ పాలిటిక్స్ చూసుకుంటారు. తానే సీఎం అన్న రేంజ్లో బిల్డప్ ఇచ్చారు. తన వర్గం ఎమ్మెల్యేలతో సీఎం, సీఎం అని నినాదాలు కూడా చేయించుకున్నారు. అయితే ఆ కల్వకుంట్ల దొరలు కన్న కలలు ఒక్కటి కూడా నెరవేరలేదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరుస పరాభవాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీకి గుడ్‌బై చెపుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన బైపోల్స్‌లో కూడా కారు టైర్లు పేలిపోయాయి. ఆ దెబ్బతో ఇప్పటికే కొంతమంది బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. మరికొందరు కాంగ్రెస్ లేదా బీజేపీలోకి వెళ్లాలని చూస్తున్నారు. ఇలాంటి కష్టకాలంలో యాక్టివ్‌గా ఉంటూ పార్టీ నాయకులను మరోపార్టీకి వెళ్లిపోకుండా ఆపాల్సిన కేటీఆర్ సైలెంట్‌గా ఉండటం ఏమిటన్న విమర్శలు వస్తున్నాయి. అసలు ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్యాపబులేనా? అన్న అనుమానాలు పార్టీ వర్గాల్లోనే వ్యక్తమవుతున్నాయి. ఆయన్ని ఆ పోస్టు నుంచి దించాలని డిమాండ్లు కూడా మొదలయ్యాయి. లోక్‌సభ

చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే

## భార్య ఆత్మహత్య

హైదరాబాద్ ప్రభాత సూర్యుడు

చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపా దేవి ఆత్మహత్య చేసుకున్నారు. అల్వాల్ లోని పంచశీల కాలనీ లోని నివాసంలో ఆమె ఉరి వేసుకున్నారు. రూపాదేవి వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలియాల్సి ఉంది.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రూపాదేవి దంపతులకు ఇద్దరు పిల్లలు కాగా.. ఆమె రెండు రోజుల నుంచి స్కూలుకు వెళ్లలేదని సమాచారం రమాదేవి ఆత్మహత్య అర్ధరాత్రి బయటకు వచ్చింది. ఆత్మహత్యకు ముందు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు భార్య వీడియో కాల్ చేసారు. బుధవారం అల్వాల్ నుంచి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొప్పదండికి వెళ్లగా, సాయంత్రం ఆయనకు రూపాదేవి వీడియో కాల్ చేసి చనిపోతున్నానని చెప్పారు. మేడిపల్లి సత్యం ఇంటికి చేరుకునేలోపే ఆమె ఆత్మహత్య చేసుకోగా, విగతజీవిగా పడి ఉన్న భార్యను చూసి సత్యం బోరున విలపించారు.





కాంగ్రెస్ పార్టీలో చేరిన

# పోచారం శ్రీనివాస్ రెడ్డి

### పోచారం ఇంటికి వెళ్లి స్వయంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి

### బాల్క సుమన్ ఆధ్వర్యంలో పోచారం ఇంటిని ముట్టడించిన బిఆర్ఎస్ కార్యకర్తలు

### పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటి దగ్గర ఉద్రిక్తత

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి పోచారం శ్రీనివాస్ రెడ్డి

మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# డైలామాలో కేటీఆర్ ఫ్యూచర్




**మొదటిపేజీతరువాయి..**
ఎన్నికల్లో సత్తాచాటుతామని బీరాలు పలికిన ఆయన.. ఇప్పుడు అవమాన భారంతో బయటకు రావడం లేదని ప్రత్యర్థి పార్టీలు విమర్శిస్తున్నాయి. మరోవైపు ఎన్నికల అఫిడవిట్ పై కోర్టు విచారణ , ఫోన్ ట్యాపింగ్ కేసు, గొర్రెల స్కామ్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు, ఇలా బీఆర్ఎస్‌లోని పెద్ద తలకాయల చుట్టూ గట్టిగానే ఉచ్చు బిగుస్తోంది. ఈ పరిస్థితుల్లో కేటీఆర్‌కు పార్టీని హ్యాండిల్ చేసే సినిమా లేదని.. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు తీసి మళ్లీ ఫారిన్ పంపించేస్తే బెటర్ అన్న సూచనలు కూడా వస్తున్నాయంట. ఎంత కాదన్న రెండు టర్మ్‌లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ పార్టీని వదులుకోలేరు. కొడుకు కేటీఆర్ యాక్టివ్ రోల్ పోషించిన లోక్‌సభ ఎన్నికల్లో సొంత జిల్లా మెదక్ లోనూ బీఆర్ఎస్‌కు కలిసి రాలేదు. ఇక రేపోమాపో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఇటు చూస్తే పార్టీ కేడర్ పూర్తిగా నిరుత్సాహంలో ఉంది. దాంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి మార్పు పైన కేసీఆర్ ఆలోచన చేస్తున్నారంట. ట్రాక్ తప్పిన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి ఎలాగొలా గాడిలో పెట్టడానికి కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పార్టీలో కీలక బాధ్యతల నుంచి తప్పించాలని భావిస్తున్నారంట. కేటీఆర్ స్థానంలో కుటుంబంలోనే మరొకరికి కేటాయించాలా లేదా బయట వ్యక్తులకు ఆ పదవి కట్టబెట్టాలా అనేదానిపై కేసీఆర్ సమాలోచనలు కొనసాగిస్తున్నారంటున్నారు. ఆ క్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు రేసులో హరీష్‌రావు పేరు ఫోకస్ అవుతుంది. హరీష్‌కు అప్పగించినా కుటుంబ సభ్యులకే మరోసారి పదవి ఇచ్చారనే విమర్శలు ఎదురయ్యే ఛాన్స్ ఉంది. దీంతో హరీష్ తో పాటుగా ఎస్సీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఎవరినైనా రెండో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయాలని చూస్తున్నారంట. తెలంగాణ వచ్చినప్పుడు దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తానని ఎన్నికల ప్రచారంలో ఘనంగా ప్రకటించారాయన. గెలవగానే ఆ విషయం మర్చిపోయారు. ఇప్పుడు రెండో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవైనా ఆ వర్గానికి కేటాయించాలని లీడర్ని వెతుక్కుంటున్నారంట. మొత్తానికి అలా సాగిపోతోంది కారు పార్టీ ప్రయాణం.

### కేటీఆర్ నోటీసులు

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌కు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నామినేషన్ సందర్భంగా కేటీఆర్ సమర్పించినటువంటి ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఉందంటూ కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి, లగిశెట్టి శ్రీనివాసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు.. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేటీఆర్ తోపాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, సిరిసిల్ల రిటర్నింగ్ ఆఫీసర్ కు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.**

## నారాయణ కాలేజీ గోడ దూకేందుకు ప్రయత్నించి విద్యార్థి మృతి



**హయత్ నగర్ ప్రభాత సూరీడు :** కాలేజీ గోడ దూకెందుకు ప్రయత్నించిన విద్యార్థి ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి మృతిచెందిన విషాద ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోహెడ గ్రామంలో ఉన్నటువంటి నారాయణ కళాశాలలో గిరీష్ కుమార్ అనే విద్యార్థి చదువుతున్నాడు. తనకు ఇష్టం లేకపోయినా తల్లిదండ్రులు తనను హాస్టల్లో వేశారంటూ గిరీష్ కుమార్ అనే విద్యార్థి గురువారం అర్ధరాత్రి కళాశాల గొడ దూకేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోన గోడపై ఉన్న విద్యుత్ తీగలు గిరీష్ కుమార్ తలకు తగలడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అయితే గిరీష్ విగత జీవిగా పడి ఉండటాన్ని చూసిన తోటి విద్యార్థులు కాలేజీ యాజమాన్యానికి సమాచారం అందజేశారు. అనంతరం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. శుక్రవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అప్పటి వరకు తమతో ఉన్న గిరిష్ కుమార్ మృతి చెంద డంతో తోటి విద్యార్థులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు.



# 'డబ్బుల్' బెడ్ రూమ్ గోల్ మాల్

## డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులో అధికారుల చేతివాటం

**మొదటిపేజీతరువాయి..** ఇప్పుడు అడిగితే బదిలీపై వెళ్లిపోయామని సమాధానం ఇస్తున్నారని మొర పెట్టుకుంటున్నారు. బాధితుల ఆరోపణలకు ఊతం ఇచ్చేలా జిల్లా కేంద్రంలో ఓ మహిళకు ఇళ్ల కేటాయింపు అంశం తెరవిూదకు వచ్చింది. సదరు మహిళకు మొదటగా మౌలాలిగుట్టలో 14299 ఇంటిని కేటాయించడంతో అది నచ్చలేదని తిరస్కరించారు. దివిటిపల్లిలో మరో నెంబర్ ఊ 22573 తో ఇళ్లు కేటాయించారు. అయితే అది కూడా నచ్చకపోవడంతో ప్రస్తుతం ఏ 21553 కేటాయించారు. ఓ పక్క ఇళ్లు రాక బాధితులు అధికారుల కాళ్ల వేళ్ల పడుతుంటే ఆ మహిళకు మాత్రం కోరిన చోట, నచ్చిన ఇళ్లు కేటాయించడం వెనుక అవినీతే ప్రధాన కారణమని తెలుస్తోంది. సదరు అధికారుల చేతివాటంతోనే ఈ తతంగం అంతా నడిచిందని బాధితులు చెబుతున్నారు. ఆ తహసిల్దార్ ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లినప్పటికీ ఇప్పటికూడా ఖాళీ ఇళ్లకు పాత తేదిలతో సంతకాలు చేసి కేటాస్తున్నారని ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన వంటల వెంకటేశ్, సత్యనారయణ, సరితా అనే మహిళతో పాటుగా పలువురు అధికారులకు డబ్బులు సమర్పించుకుని లబోదిబోమంటున్నారు. పైసా పైసా పోగు చేసి గూడుకోసం ఇస్తే మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ తో పాటుగా ప్రగతి భవన్ వద్ద జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బాధితుల వరుస ఫిర్యాదులతో డబుల్ ఇళ్ల స్కాంపై రహస్య విచారణ సాగిస్తున్నట్లు తెలుస్తోంది. మోసపోయిన తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని, రైతుల కోసం పాటుపడే వ్యక్తి అని బిఆర్ఎస్ ఎంఎల్ఏ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రేవంత్‌రెడ్డి స్వయంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. రేవంత్ సమక్షంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుమారుడు భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పోచారం మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి రైతులకు మంచి చేస్తున్నారని ప్రశంసించారు. రేవంత్ చేపడుతున్న రైతు అనుకూల పనులకు గర్విస్తున్నామని, రేవంత్ యువకుడు అని, మరో 20 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించే సత్తా ఉందని పోచారం మెచ్చుకున్నారు. అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లారు. బిఆర్ఎస్ పార్టీ తరపున బాన్సువాడ నుంచి ఆయన ఎంఎల్ఏగా గెలుపొందారు. దీంతో కాంగ్రెస్ పార్టీలోకి రావాలని పోచారానికి రేవంత్‌రెడ్డి ఆహ్వానం పలికారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా పోచారాన్ని కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌పై ఉన్న భక్తితో ఆ పార్టీలో ఉంటారా? లేక మంత్రి పదవి ఆశ చూపితే కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారా అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఈ విషయం హాట్ టాఫిక్‌గా మారింది. బిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసేందుకు 13 మంది ఎంఎల్ఎలకు రేవంత్ రెడ్డి గాలం వేస్తున్నట్టు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో హైదరాబాద్‌లోని పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటి దగ్గర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ బాల్క సుమన్ ఆధ్వర్యంలో పోచారం ఇంటిని బిఆర్ఎస్ కార్యకర్తలు ముట్టడించారు. పోలీసులు, బాల్కసుమన్ వర్గీయులకు మధ్య వాగ్వాదం తలెత్తడంతో బాల్క సుమన్ ను అరెస్ట్ చేసారు.

## టీచర్ల బదిలీలకు మరో అవకాశం

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా మల్టీ జోన్2 లోని ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించనుంది.ఒకే చోట కనీసం రెండేళ్లు సర్వీసు పూర్తి చేసు కున్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం రెండ్ రోజులు అవ కాశం ఇచ్చింది. కాగా, మల్టీ జోన్ 2 పరిధిలోని 14 జిల్లాల్లో ఉపాధ్యాయ సీనియారిటీ జాబితాను శుక్రవారం విడుదల చేసే అవకాశం ఉంది.

## 3 రోజులు వానలే... వానలు

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** తెలంగాణకు వాతావరణ శాఖ కూల్ న్యూస్ అందించింది. రానున్న 3 రోజులు రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడిరచింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ నగరంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాతబస్తీ, రాయదుర్గం, మాదాపూర్, గచ్చిబౌలి, కొత్తపేట సరూర్ నగర్, చంపాపేట్, సైదాబాద్, మాదన్నపేట్, మలక్‌పేట్, చాదర్‌ఘాట్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలో రానున్న 3 రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం.. ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందన్నారు. ఆదివారం.. నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వెల్లడిరచారు. గంటకు 3040 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. సోమవారం.. సిద్ధిపేట, యాదాద్రి భువగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. అటు, ఏపీలోని కొన్ని జిల్లాల్లోనూ అక్కడక్కడ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తా, రాయలసీమల్లో అక్కడకక్కడ శుక్రవారం వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడిరచారు. అల్లూరి జిల్లా, కాకినాడ, కోనసీమ, ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని అన్నారు. శనివారం.. శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.

## పవన్‌కు సినిమాలే బెటర్






### జేసీ దివాకర్ రెడ్డి సంచల వ్యాఖ్యలు

**తాడిపత్రి ప్రభాత సూర్యుడు :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జేసీ.. పవన్ గురించి మాట్లాడుతూ.. 'పవన్ కళ్యాణ్ గురించి నాకు పెద్దగా తెలియదు. తనను ఎప్పుడూ కలవలేదు. ఇప్పుడే బాధ్యతలు చేపట్టారు. నెల రోజుల తర్వాత పరిపాలన, విధానాలపై తెలుస్తుంది. నాకు తెలిసినంతవరకూ పవన్ రాజకీయాల్లో ఉండకపోవచ్చు. ఆర్థికంగా చూసుకుంటే పవన్‌కు రాజకీయాలకంటే సినిమాలే బెటర్.' అని కామెంట్స్ చేశారు

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# ఎడారిగా శ్రీరామ్ సాగర్

**నిజామాబాద్ - ప్రభాత సూర్యుడు**

ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని సుమారు 12 లక్షల ఎకరాలకు తాగు, సాగునీరు అందించేందుకు నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8 టీఎంసీలు మాత్రమే నీరుంది. దీంతో ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్ కి పడిపోయింది. వర్షాకాలం ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా.. వరుణుడి కరుణ లేకపోవటంతో ఇప్పటివరకు కేవలం 1 టీఎంసీ నీరుమాత్రమే చేరింది. అటు ప్రాజెక్టు ఎగువన గల గోదావరి పరివాహ ప్రాంతంలో సైతం వర్షాలు లేకపోవడంతో గోదావరిలో కి ఇన్‌ఫ్లో లేకపోవటం, ఇటు ఖరీఫ్ సీజన్ మొదలు కావటంతో రైతన్నల్లో ఆందోళన మొదలైంది.ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్ర నిర్మించిన బాబ్లీ, విష్ణుపురి ప్రాజెక్ట్‌ల పరిస్థితీ ఇదే. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాబ్లీ గేట్లు జూలై 1న ఎత్తాలి. కానీ, ఆ ప్రాజెక్టు ఖాళీ కుండలా ఉండటంతో గేట్లు ఎత్తినా ప్రయోజనం లేదు. ఇక.. ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతంలోని విష్ణుపురి ప్రాజెక్ట్ నుంచే ప్రస్తుతం కొద్దికొద్దిగా నీరు చేరుతోంది.మరోవైపు.. ఎస్సారెస్పీకి పూర్వ వైభవం తెచ్చేందుకు గత ప్రభుత్వం రూ. 1067 కోట్ల నిధులతో పునరుజ్జీవన పథకం పనులు ప్రారంభించి, గత జులైలో కాళేశ్వరం నుంచి 25 టీఎంసీల నీటిని తరలించారు. కానీ, ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిస్థితి గందరగోళంగా మారటంతో ఈ ఏడాది తమ ఖరీఫ్ పంట ఏమవతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. పదేళ్లలో 2016, 2018లో మాత్రమే సమయానికి వరదనీరు వచ్చి చేరింది. 2016లో జూలై నాటికే ప్రాజెక్ట్ నిండుకుండలా మారగా, వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలాల్సి వచ్చింది. 2018లోనూ ముందస్తు వరదలు వచ్చినా తర్వాత వానలు లేక.. ప్రాజెక్టు నిండలేదు. 2023లో సకాలంలో వరద నీరు భారీగా రావటంతో జూలైలో ప్రాజెక్ట్ నిండిరది. మిగిలిన సంవత్సరాల్లో ఎప్పుడూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే వరదలు వచ్చి ప్రాజెక్టుకు వరదనీరు వచ్చింది. దీంతో ఆయా సంవత్సరాల్లో అధికారులు.. ఖరీఫ్‌కు నీటి విడుదల చేపట్టకుండా రబీ సీజన్ నాటికి కాస్త ముందుగా నీటిని విడుదల చేశారు. ప్రస్తుత పరిస్థితులు నేపథ్యంలో ఏ ఏడాదీ అదే పరిస్థితి వచ్చే అవకాశముందని నీటిపారుదల శాఖ భావించగా, వరుణుడు దయ తలిస్తే వారంలోనే ఈ పరిస్థితి మారి, తమకు ఖరీఫ్ పంట కూడా దక్కుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 112 టీఎంసీల పూర్తి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో నిర్మించిన నాటి నుంచి పూడిక పేరుకుంటూ వచ్చింది. దీంతో ప్రాజెక్టు సామర్థ్యం ప్రస్తుతం 90 టీఎంసీలని చెబుతున్నప్పటికీ, నిజానికి అంతకంటే తక్కువగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

# రూటు మార్చిన కారు..!

**బాబు ఇమేజ్ పెంచుతున్న గులాబీ దళం**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



తెలుగుదేశం పార్టీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేసిందని కేటీఆర్ మీడియా ముందు చెప్పారు. నిజానికి ఈ విషయాన్ని టీడీపీ కూడా చెప్పుకోవడం లేదు. నిజామా తాము ఇంత విజయం సాధించామా అని ఏపీలోని టీడీపీ క్యాడర్ కూడా ఆశ్చర్యపోయింది. నిజానికి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేశామని కేంద్రం అధికారికంగా ఎక్కడా ప్రకటించలేదు. కానీ కొత్తగా బాధ్యతలు చేపట్టిన గనుల మంత్రి కిషన్ రెడ్డి మాత్రం.. ఇప్పట్లో ప్రైవేటీకరణ ఉండబోదని ప్రకటన చేశారు. దీన్నే ప్రైవేటీకరణ నిలిపివేత ప్రకటనగా కేటీఆర్ భావించారు. ఇప్పుడు కేంద్రంలో టీడీపీ కూడా కీలకమైన భాగస్వామి కాబట్టి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అంగీకరించదు. ఈ విషయం తెలుసు కాబట్టి కేంద్రం వ్యూహాత్మకంగా వెనక్కి తగ్గుతుంది. అందులో పెద్ద రాజకీయం లేదు. .అయినా కేటీఆర్ టీడీపీని పదే పదే పొగడటానికి దీన్నో కారణంగా తీసుకున్నారు. ఆయనే కాదు.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో కీలక నేత హరీష్‌రావు కూడా టీడీపీ అధినేత చంద్రబాబును ఛాన్స్ దొరికినప్పుడల్లా పొగుడుతున్నారు. అయితే రేవంత్‌ను కార్నర్ చేయడానికి ఆయన చంద్రబాబు ప్రస్తావన తెస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అంటే బీఆర్ఎస్ అగ్రనేతలకు అంత అభిమానం లేదు. మొదటి నుంచి టీడీపీకి వ్యతిరేకంగానే ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించి సమైక్యాంధ్రకు మద్దతు తెలిపినప్పటికీ రాష్ట్ర విభజన అనంతర రాజకీయాల కారణంగా వైసీపీ అధినేత జగన్‌తోనే సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ గురించి ఎప్పుడూ బీఆర్ఎస్ పెద్దలు పాజిటివ్ గా మాట్లాడలేదు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ ఓడిపోతుందని చెబుతారు. 2014 ఎన్నికల సమయంలో కూడా కేసీఆర్ ఏపీలో టీడీపీ ఓడిపోతుందని జోస్యం చెప్పారు. 2019 ఎన్నికల నాటకి ఏపీలో వైసీపీ గెలవడానికి జగన్మోహన్ రెడ్డికి తెలంగాణలో అధికార పార్టీగా అన్ని రకాలుగా అండాగ నిలిచారు. ఇటీవలి ఎన్నికల్లో చాలా మీడియా ఇంటర్వ్యూల్లో ఏపీలో టీడీపీ ఓడిపోతుందని.. జగన్ రెండో సారి అధికారంలోకి వస్తారని తమకు సమాచారం ఉందని చెబుతూ వచ్చారు. కానీ ఇప్పుడు పూర్తిగా వారి అభిప్రాయాలను మార్చుకున్నారు. టీడీపీ గురించి పాజిటివ్‌గా మాట్లాడుతున్నారు.తెలంగాణకు ప్రాంతీయ పార్టీలే శ్రీరామరక్ష అని చెప్పాలనేది కేటీఆర్ వ్యూహం. ఎంత శ్రీరామరక్ష అనేది తెలంగాణ ప్రజలకు చెప్పాలంటే.. వారికి ఎదురుగా టీడీపీనే కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీని అక్కడి ప్రజుల గెలిపించడం వల్ల ఆ రాష్ట్రం ఎన్నో ప్రయోజనాలు పొందుతుందని చెప్పాలని కేటీఆర్ అనుకుంటున్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్నందున పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందబోతోందని ఇటీవల ట్వీట్ చేశారు. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ టీడీపీ ఆపేసిందని క్రెడిట్ ఇచ్చేశారు. అదే బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఉంటే సింగరేణిని కాపా?కునేవారమని.. జాతీయ పార్టీలకు ఓటు వేయడం వల్ల.. గనులు కూడా వేలం లో పాడుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఇది.. తెలంగాణకు అన్యాయం చేయడమేనని అంటున్నారు. అంటే.. కేటీఆర్ టీడీపీపై అభిమానంతో కాకుండా.. తన పార్టీని రివైవ్ చేసుకోవడానికి ..తన పార్టీ వైపు ఓటర్లు మళ్లడానికి.. టీడీపీని ఓ ఆయుధంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని సులువుగా అర్థం చేసుకోవచ్చు. మరో వైపు హరీష్ రావు కూడా చంద్రబాబును, టీడీపీ ప్రభుత్వాన్ని పొగుడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అమలు చేస్తున్నారని అంటున్నారు. దీనికి కారణం రేవంత్ అమలు చేయలేకపోతున్నారని ఆయనకు చేత కావడం లేదని విమర్శలు చేయడానికే. రేవంత్ రెడ్డి పనితీరును తక్కువ చేయడానికి చంద్రబాబును హరీష్ రావు ఉపయోగించుకుంటున్నారు. నిజానికి ఎవరి పని తీరు వారిది. రేపు ఏపీలో టీడీపీ నేతలు రేవంత్ పనితీరును చూపించి చంద్రబాబును విమర్శించవచ్చు. బీఆర్ఎస్ నేతలు తెలుగుదేసం పార్టీ జపం చేయడం రాజకీయ వర్గాలకు ఆశ్చర్యకరమే. ఎందుకంటే గతంలో కూడా బీఆర్ఎస్ నేతలు టీడీపీ పేరును తరచూ ఉపయోగించేవారు.కానీ అది నెగెటివ్ కోణంలోనే. ఆ పార్టీ తెలంగాణకు ప్రమాదమని చెప్పేందుకు ఉపయోగించేవారు. తెలంగాణ వ్యతిరేక పార్టీ..ఆంధ్రా పార్టీగా ముద్ర వేసి.. మన దగ్గర ఉనికి ఉండకూడదని ఓటర్లకు చెప్పేవారు. కానీ ఇరప్పుడు రివర్స్ లో టీడీపీ ఏపీలో గొప్పగా చేస్తోందని.. ఇక్కడ కూడా .. ఏపీ ప్రజలు టీడీపీని ఆదరించినట్లుగా.. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ను ఆదరించాలని కోరుకుంటున్నారు. అదే చెబుతున్నారు. వీరి ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయో కానీ.. టీడీపీ మరో సారి తెలంగాణలో చర్చనీయాంశం అవుతోంది.

# కమలం గూటికి గంగుల..?

**కరీంనగర్ - ప్రభాత సూర్యుడు**



సోషల్ మీడియాలో చేసిన ఒక్క పోస్టుతో ఆ మాజీ మంత్రి పార్టీ మారబోతున్నారు అంటూ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. మారడం లేదని క్లారిటీ ఇచ్చినప్పటికీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన బండి సంజయ్‌ని అభినందిస్తూ చేసిన పోస్టు ఆ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఆ పోస్ట్ చూసిన కొంతమంది ఆయన బీజేపీలో చేరడం ఖాయం అంటూండగా మరి కొంతమంది మాత్రం సీఎం రేవంత్ రెడ్డితో ఉన్న సంబంధాలతో కాంగ్రెస్ లో చేరతానని అంటున్నారు. మరి ఆ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్తారా? లేదా? అనేది రాజకీయ వర్గాలలో హాట్ టాపిక్ గా మారింది. కరీంనగర్ ప్రస్తుత ఎమ్మెల్యే మాజీమంత్రి గంగుల కమలాకర్ పార్టీ మారతారని చర్చలు రాజకీయ వర్గాలలో జోరందుకుంటున్నాయి. కరీంనగర్‌లో వరుస విజయాలు నమోదు చేసుకొని రికార్డ్ క్రియేట్ చేసుకున్నారు గంగుల కమలాకర్, కౌన్సిలర్ గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన గంగుల 2009 లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 తర్వాత ఉద్యమ పార్టీగా ఉన్న టీఆర్ఎస్ లో చేరారు. వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీఆర్ఎస్ హయాంలో కీలక శాఖలకు మంత్రిగా చేశారు. దశాబ్ద కాలంగా కారు పార్టీ లోనే జర్నీ చేస్తున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా తయారు కావడంతో తిరిగి పార్టీ మారతారంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు తాను వీర విధేయుడ్ని అంటూ చెప్పుకుంటారు. అలాంటిది గంగుల కమలాకర్ పార్టీ మారతారని ప్రచారం జరుగుతుండడంతో క్యాడర్ లో గందరగోళం నెలకొంది. ఇక బిజెపి ఎంపీ బండి సంజయ్.. కంగుల కమలాకర్ ఇద్దరు ఉప్పునిప్పులా ఉంటారు. ఇద్దరి మధ్య చాలా అంశాలలో మాటల యుద్ధం తారస్థాయికి చేరుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. సంజయ్ కి కేంద్ర హోంశాఖలో సహాయ మంత్రిగా పదవి దక్కడంతో సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ మారతారనే ప్రచారాలు ఎవరికి తోచినట్టు వారు అనువదించుకుంటున్నారు. గంగుల మాత్రం నో కామెంట్స్ అన్నట్టుగా మౌనం పాటిస్తున్నారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి గంగులకు సన్నిహితంగా సంబంధాలు ఉన్నాయి తెలుగుదేశం పార్టీలో ఇద్దరు కలిసి పని చేశారు. తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో చెరో గూటికి చేరుకున్నారు. సీఎం అయిన తర్వాత గంగుల కమలాకర్ హస్తం గూటికి చేరుతారు అనే ప్రచారం కూడా జోరుగానే జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ గంగుల కమలాకర్ కు అడ్డు చెప్పినట్టుగా మరో టాక్ వినిపించింది. అయితే జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఇటీవల కరీంనగర్ పర్యటనలో గంగుల కమలాకర్ ఇంటికి వెళ్లిన కేసీఆర్, కేటీఆర్ పార్టీ మారకుండా నచ్చ చెప్పారని సమాచారం. కమలాకర్ కూడా పార్టీ మారనని స్పష్టత ఇవ్వడంతో కొన్ని రోజులపాటు జరుగుతున్న ప్రచారానికి తెర వేసినట్టు అయ్యింది.అయితే ఈ మధ్యకాలంలో బీజేపీకి అధిక పార్లమెంట్ సీట్లు రావడం.. గంగుల కమలాకర్ సోషల్ మీడియా వేదికగా బండి సంజయ్ కి శుభాకాంక్షలు తెలపడం రాజకీయ వర్గాలలో కొంతవరకు చర్చనీయాంశంగా మారింది.



# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు

**-హరీష్ రావు**

**సంగారెడ్డి ప్రభాత సూర్యుడు**

పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుల ఇండ్లలో ఈడీ దాడులపై సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు స్పందించారు. శుక్రవారం అయన మహిపాల్ రెడ్డిని పరామర్శించారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఈడీ,ఐటీ దాడులతో వేధిస్తున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో ఏలాంటి అవినీతి ఆస్తులు దొరకలేదు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే లను భయపెట్టి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీహార్, గుజరాత్ లలో నీట్ ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారు. ప్రశ్నాపత్రాలు లీకవుతున్నా అధికారులు ఎందుకు వారిపై దాడులు చేయటం లేదు. మన రాష్ట్రంలో లక్ష కుటుంబాలు నీట్ పరీక్ష వ్రాశారు, వారిభవిష్యత్తు అయోమయంలో ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఒత్తిడికి గురిచేస్తుంది. బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లు చుట్టూ తిరుగుతూ.. అధికారపార్టీ బెదిరింపు ధోరణికి పాల్పడుతున్నారు. ఇంట్లో చిన్న పిల్లలు ఏడుస్తున్నా కర్కశంగా ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ దాడులు చేయటం దారుణమని అన్నారు.

# కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు స్టే

- **ప్రధాని మోడీ న్యాయ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారు**
- **ఆప్ నేత సంజయ్ సింగ్**

న్యూఢిల్లీ ప్రభాత సూర్యుడు



మనీ లాండరింగ్ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును ఢిల్లీ హైకోర్టు నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ న్యాయ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని ఆప్ నేత సంజయ్ సింగ్ శుక్రవారం ఆరోపించారు.'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా సంజయ్ సింగ్ ఓ పోస్ట్ పెట్టారు. అందులో ''మోడీ ప్రభుత్వం గుండాయిజం చూడండి, విచారణ కోర్టు ఉత్తర్వు ఇంకా రాలేదు, ఆర్డర్ కాపీ కూడా రాలేదు.. మోడీ తాలూకు ఈడి మాత్రం హైకోర్టుకు చేరుకుంది. అయితే ఏ ఉత్తర్వును సవాలు చేయడానికి ఈడి హైకోర్టుకు చేరుకున్నట్లు'' అని నిలదీశారు. ''మోడీజీ మీరెందుకు న్యాయ వ్యవస్థను అబాసుపాలు చేస్తున్నారు? దేశమంతా మీ వ్యవహారం చూస్తోంది !'' అని ఆప్ ఎంపీ పోస్ట్ లో పెట్టారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఇడి హైకోర్టుకు వెళ్లింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఇడి పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకు బెయిల్ ఇవ్వకూడదని కోర్టు తెలిపింది. కాగా గురువారం ఢిల్లీ మద్యం స్కామ్ సంబంధిత మనీలాండరింగ్ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేక న్యాయమూర్తి నియాయ్ బిందు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ దశలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఈ బెయిల్ ఆదేశాలను కనీసం 48 గంటల పాటు నిలిపివేయాలని, తాము ఎగువకోర్టుకు వెళ్లేందుకు వీలు కల్పించాలని వేడుకుంది. అయితే ఈ అభ్యర్థనను ప్రత్యేక న్యాయమూర్తి తోసిపుచ్చారు. కేజ్రీవాల్ రూ 1 లక్ష పూచీకత్తుతో విడుదలకు ఆదేశించిన కోర్టు కొన్ని షరతులు విధించిన విషయం తెలిసిందే

# సంపాదాకీయం



# ఓటరు చేతిలోనే పవర్ అస్త్రం

ఎన్నికలంటే లెక్కలు..రాజకీయసమీకరణాలు..కూడికలు...తీసివేతలు.. కానీ చివరికి ఏదో వస్తుందో అదే అన్సర్. చివరకు మిగిలేది అదే. సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. కొత్త ప్రభుత్వాలు కొలువు తీరాయి. ఇక రాజకీయ పార్టీలు, నేతలు తప్పు ఎక్కడ జరిగిందని లెక్కలు వేసుకుంటున్నాయి. మెజార్టీలు ఎక్కడ తగ్గాయి.. ఎందుకు తగ్గాయి.. ఓటమికి కారణాలపై దృష్టి పెట్టాయి. అయితే పరిస్థితిలో ఈ ఎన్నికల్లో ఎవరికి ఏం మిగిల్చాయి. దేశంలోని కొద్ది మంది ముఖ్యనేతలకు ఈ ఎన్నికల తర్వాత చివరకు మిగిలిందేంటి అన్న విశ్లేషణ ఇప్పుడు చూద్దాం.. ఏ పార్టీని అధికారం పీఠం ఎక్కించాలన్నా వారిని గద్దె దించాలన్నా ఓటరు మహాశయుడే కీలకం అని మరోసారి సార్వత్రిక ఎన్నికలు తేల్చి చెప్పాయి. ఎన్ని రాజకీయ విన్యాసాలు చేసినా.. ఓటరు తాను నమ్మినవారికి, నచ్చిన వారికి మాత్రమే ఓటు వేస్తాడని రుజువు చేశాయి ఈ ఎన్నికలు. అయితే ఈ ఎన్నికలను ఓటరు కోణంలో చూస్తే చివరకు మిగిలిందేంటి అన్న ప్రశ్న వేసుకుంటే ప్రతీ ఐదేళ్ల తర్వాత ఎంతటి బలమైన పాలకుడినైనా మార్చగలిగే శక్తి నాదే అన్న సంతృప్తి ఓటరుకు మిగిలింది.ప్రధాన నరేంద్రమోదీ విషయానికి వస్తే 400 మార్కు దాటుతామని పదే పదే చెప్పినా అంత సీన్ లేదు అంటు బొటాబొటి మార్కులతో నరేంద్రమోదీని ప్రధానిగా పాస్ చేశారు. మళ్లీ అవకాశం ఇస్తున్నామంటే.... కొంచెం జాగ్రత్తగా ఉండమని ఓటర్లు హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో 240 సీట్లే బీజేపీ గెల్చినా మళ్లీ అధికారంలోకి రాగలిగామన్న సంతృప్తి ఈ ఎన్నికల తర్వాత ప్రధాని నరేంద్రమోదీకి మిగిలింది.మోదీ తర్వాత దేశ రాజకీయాల్లో ముఖ్యమైన వ్యక్తి రాహుల్ గాంధీ. కాంగ్రెస్ అగ్రనేత. ఈ ఎన్నికల ద్వారా పని చేస్తే ఫలితం ఉంటుందని ఓటరు తీర్పు చెప్పి మరీ రుజువు చేశాడు. రెండు దఫాలుగా దేశంలో చేసిన పాదయాత్రకు చిహ్నంగా కాంగ్రెస్‌కు 99 సీట్లు కట్టబెట్టాడు. 2019 ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ సీట్లు రెట్టింపు అయ్యాయి. అధికారంలోకి రాకపోయినా దరిదాపుల్లోకి ఇండియా కూటమిని తీసుకువచ్చామన్న తృప్తిని ఈ ఎన్నికలు మిగిల్చాయి. భవిష్యత్తులో కాంగ్రెస్‌ను దేశ రాజకీయాల్లో నిలబెట్టగల సామర్థ్యం ఉందని రుజువు చేసుకున్న సంతృప్తి రాహూల్‌ది.యూపీకి వెళ్తే అఖిలేశ్ యాదవ్. హేమాహేమీల్లాంటి రాజకీయ ఉద్దండులు తమ రాష్ట్రం నుంచి పోటీలో ఉన్నా సమాజ్ వాదీ పార్టీని రాష్ట్రంలో నెంబర్ వన్‌గా నిలిపారు. అదే రాష్ట్రం నుంచి ప్రధాని మోదీ పోటీ చేసినప్పటికీ.. ఆయన్ని ఎదుర్కొని మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నారు. 80 ఎంపీ సీట్లకు బీజేపీ కూటమి 36 స్థానాలే గెల్చుకుంటే, సమాజ్ వాదీ ఉన్న ఇండియా కూటమి 43 స్థానాల్లో గెలిపించిన నేతగా అఖిలేశ్‌కు ఈ ఎన్నికలు జాతీయ స్థాయిలో గుర్తింపునిచ్చాయి. దీదీ మమతా బెనర్జీ మరో దఫా పశ్చిమ బెంగాల్ తన ఇలాఖా అని చాటి చెప్పారు. బీజేపీని అడ్డుకోవడంలో తనకు తిరుగులేదన్న సంకేతం ఈ ఎన్నికల ఫలితాల ద్వారా చెప్పగలిగారు. యూపీ, మహారాష్ట్ర తర్వాత అత్యధిక ఎంపీలున్న రాష్ట్రం పశ్చిమ బెంగాల్. ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్ 29 సీట్లలో గెలిచి సత్తా తగ్గలేదని నిరూపించుకుంది. 2019 ఎన్నికలతో పోల్చితే అదనంగా 7 సీట్లు గెల్చుకుంది. బీజేపీ 12 సీట్లే గెల్చుకుంది. 2019తో పోల్చితే 6 సీట్లు కోల్పోయింది. జాతీయ రాజకీయాల్లో తన పాత్ర ఎంతో కీలకమని, మోదీని అడ్డుకునే నేతల్లో తాను ఉన్నానన్న సంతృప్తి దీదీకి ఈ ఎన్నికలు మిగిల్చాయి.ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్‌లో 3 ఎంపీ స్థానాలను గెల్చుకుంది. అయితే ఈ ఎన్నికల నేర్పింది పార్టీ అగ్రనేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీష్‌సిసోడియా ఇద్దరు జైలు కెళితే పార్టీని నడిపే రెండో తరం నేతలు లేని పరిస్థితి. ఆ ప్రభావం పార్టీపై ఎలా ఉందో కేజ్రీవాల్‌కు నేర్పాయి. అంతా తానై నడిపిస్తే ఏ పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందో ఈఎన్నికల ఫలితాలు ఓ పాఠం.విషయానికి వస్తే అత్యధిక కాలం ఓ రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తిగా రికార్డు కొడదామన్న బీజేడి అధినేత నవీన్ పట్నాయక్ ఈఎన్నికలు గట్టి దెబ్బ తీశాయి. అధికార పీఠాన్ని బీజేపీకి ఒదులుకోవాల్సిన పరిస్థితిని కల్పించాయి. 21 పార్లమెంట్ స్థానాల్లో 20 బీజేపికి ఓటరు కట్టబెట్టారు. 145 అసెంబ్లీ స్థానాలకు బీజేపీ తొలిసారి 78 స్థానాలు గెలిచి అధికారం చేజిక్కించుకుంది. ప్రజలకు దూరంగా అధికారులతో ప్రభుత్వాన్ని నడపితే.. తమ తీర్పు ఇలా ఉంటుందన్న అనుభవాన్ని ఓటర్ ఈ ఎన్నికల ద్వారా రుచి చూపించారు.తమిళనాడు విషయానికొస్తే బీజేపీకి డోర్ తెరిచేది లేదంటూ తమిళ ఓటరు.. స్టాలిన్ కే విజయాన్ని కట్టబెట్టారు. 39 పార్లమెంట్ సీట్లలో డీఎంకే కూటమినే గెలిపించారు. హిందుత్వ ఎజెండా ఇక్కడ చెల్లదని తమిళ ఓటరు చెప్పకనే చెప్పారు. తన నాయకత్వానికి తిరుగులేదన్న ఆత్మవిశ్వాసం డీఎంకే అధినేత స్టాలిన్‌కు కట్టబెడితే... అమ్మ లేని పార్టీ అన్నాడీఎంకే నాయకత్వంపై ప్రశ్నలు తలెత్తే పరిస్థితిని కల్పించాయి.తెలుగు రాష్ట్రాల్లో ఇద్దరు కీలకనేతలకు మాత్రం ఈ ఎన్నికలు విషాదాన్ని నింపాయి. మరో ఇద్దర నేతల్లో ఆనందాన్ని నింపాయి. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలను పడగొట్టి, ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు తెలుగు ఓటరు పట్టం కట్టారు. ఏపీలో చంద్రబాబు, పవన్ కూటమి సూపర్ హిట్ కొట్టగా, జగన్ ఈ ఎన్నికల్లో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. అధికారం శాశ్వతం కాదని, ఆ స్టీరింగ్ ఓటరు చేతిలోనే ఉందని తెలుగు ఓటర్ నిరూపించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ

**పాట్నా - ప్రభాత సూర్యుడు**

బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దళితులు, వెనుకబడిన తరగుతుల, గిరిజనులకు రిజర్వేషన్ కోటాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచాలని గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు గురువారం కొట్టివేసింది. రిజర్వేషన్ కోటాను పెంచుతూ 2023 నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై చీఫ్ జస్టిస్ కె వినోద్ చంద్రన్ నేతృత్వంలోని పాట్నా హైకోర్టు డివిజన్ బెంచ్ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. బీహార్‌లో కులాలపై సమగ్ర సర్వే జరిపిన రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి, ఇబిసిల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కోటాను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో ఈ అణగారిన వర్గాలకు రిజర్వేషన్ కోటాను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ గత ఏడాది నవంబర్ 21న ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను నితీష్ కుమార్ ప్రభుత్వం జారీచేసింది.రజ్యాంగంలోని 14, 16, 20 అధికరణలను రాష్ట్ర ప్రభుత్వం తన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఉల్లంఘించిందని, తాము చేసిన వాదనలపై విచారణ జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్ మార్చిలో తన తీర్పును రిజర్వ్ చేసిందని, ఈ రోజు తమ పిటిషన్లపై తీర్పును వెలువరించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులలో ఒకరైన రితికా రాణి తెలిపారు.




కుల గణన ఆధారంగా తాము రిజర్వేషన్ కోటాను పెంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం వాదించిందని, అయితే ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులతోపాటు ఇటీవల మరాఠాల రిజర్వేషన్లకు సంబంధించిన కేసులో 50 శాతం గరిష్ఠ పరిమితికి మించి ఏ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను పెంచడానికి వీల్లేదని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసిన విషయాన్ని తాము ఉటంకించామని మరో పిటిషనర్ తరఫు న్యయవాది నిర్భయ్ ప్రశాంత్ తెలిపారు. జనాభా గణాంకాల సేకరణలో భాగమైన ఎస్‌సి, ఎస్‌టిల జనాభా మినహాయించి మిగిలిన సామాజిక వర్గాల లెక్కలను సేకరించడంపై కేంద్రం నిస్సహాయతను వ్యక్తం చేసిన దరిమిలా బీహార్‌లో కులగణన నిర్వహించిన నితీష్ కుమార్ ప్రభుత్వం ఆ లెక్కల వివరాలను గత ఏడాది అక్టోబర్ 2న విడుదల చేసింది.ఈ సర్వే ప్రకారం రాష్ట్ర మొత్తం జనాభాలో ఓబిసిలు అత్యధికంగా 63 శాతం ఉండగాఎస్‌సి, ఎస్‌టిలను మొత్తం గా లెక్కగడితే 21 శాతానికి మించి ఉన్నారు. కాగా..కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాలకు(ఇడబ్లుస్) 10 శాతం కోటాను ప్రవేశపెట్టి రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఇదివరకే అతిక్రమించిందని బీహార్ ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేసింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఓబిసిలు, ఇబిసిల రిజర్వేషన్ కోటాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తన రిజర్వేషన్ చట్టాలను సవరించింది. ఇదబ్లుఎస్ కోటా 10 శాతాన్ని కూడా కలుపుకుంటే రాష్ట్రంలోని మొత్తం జనాభాలో 75 శాతం మందికి రిజర్వేషన్ కోటా వర్తిస్తోంది. తాము సవరించిన రిజర్వేషన్ చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపరచాలని కూడా కేంద్రాన్ని బీహార్ ప్రభుత్వం కోరింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో ఉండే కేంద్ర, రాష్ట్ర చట్టాలను కోర్టులలో సవాలు చేసేందుకు అవకాశం ఉండదు. రిజర్వేషన్ కోటాపై 50 శాతం గరిష్ఠ పరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు 1992లో ఉత్తర్వులు జారీచేసింది.కాగా..బీహార్‌లో నితీష్ కుమార్ సారథ్యంలోని జెడియుతో అధికారాన్ని పంచుకున్న సమయంలో వచ్చిన ఈ కోటా చట్టాల సవరణను స్ఫూర్తిగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తామని తన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసింది. అయితే ప్రస్తుతం బీహార్‌లో నితీష్ కుమార్‌తో కలసి అధికారాన్ని పంచుకుంటున్న బిజెపి కూడా రిజర్వేషన్ కోటాల సవరణ విషయంలో తమ పాత్ర కూడా ఉందని వాదిస్తోంది. 2022లో అధికార కూటమిలో తాము భాగస్వామిగా ఉన్న కాలంలోనే కుల గణనకు ఆదేశాలు జారీ అయినట్లు చెబుతోంది.

# కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

**అమరావతి - ప్రభాత సూర్యుడు**

ఎపి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్ని మరో 6 నెలలు పొడిగించాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖరాశారు. ఇటీవల సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నీరబ్, పదవీకాలం ఈనెల 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆయన సర్వీసును మరో 6 నెలలపాటు పొడిగించాలని కేంద్రాన్ని సీఎం కోరారు. కాగా కేంద్రం ఒకే విడతలో 6 నెలలు పొడిగింపు ఇస్తుందా, లేదా 3 నెలల చొప్పున రెండుసార్లు పొడిగిస్తుందా వేచి చూడాలి.

# ప్రొ. యశంకర్ త్యాగాలు మరువలేనివి

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు**



ప్రొ.జయశంకర్ త్యాగాలు మరువలేనివాణి, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం తన జీవితాన్ని అర్పించిన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. నేడు జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. పదేళ్లపాటు కొనసాగిన బీఆర్ఎస్ ప్రగతి పాలనలో జయశంకర్ స్ఫూర్తి ఇమిడి ఉంది. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ నేటి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఆత్మ గౌరవాన్ని మరింతగా ఇనుమడిరపజేసే దిశగా పాలన అందించిన నాడే వారికి ఘన నివాళి అర్పించిన వారమవుతాం అని తెలిపారు.

# సీఎంగానే అసెంబ్లీకి లోకి బాబు ఎంట్రీ

**అన్న మాట నిలబెట్టుకున్న చంద్ర బాబు**

**అమరావతి ప్రభాత సూర్యుడు**



చంద్రబాబు అన్న మాటను నిలబెట్టుకున్నారు. అయిదేళ్ల క్రితం 23 స్థానాలకే పరిమితమైన స్థాయి నుంచి.. అసెంబ్లీలో వ్యక్తిత్వ హననం, తన కుటుంబ సభ్యులకు జరిగిన అవమానం, అధికార పక్ష సభ్యుల వ్యక్తిగత ధూషణల నేపథ్యంలో ఇది గౌరవ సభ కాదు, కౌరవ సభ, తిరిగి ఈ సభకు ముఖ్యమంత్రిగానే వస్తానని సవాలు చేసిన చంద్రబాబు రెండున్నరేళ్లు తిరిగేసరికీ అన్నంత పనీ చేశారు. నిజానికి అంతకు మించే చేశారు. తనను, తన పార్టీని తీవ్ర అవమానాలకు గురి చేసిన వైసీపీకి ప్రతిపక్ష హోదా సైతం లేకుండా చేసి తలెత్తెకుని అసెంబ్లీలో అడుగు పెట్టారు. చంద్రబాబుకు అసెంబ్లీలో ఎదురైన అవమానాలు చూసిన వారెవ్వరూ మళ్లీ ఆయన పుంజుకోగలుగుతారని ఊహించి ఉండరు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో చంద్రబాబుకి మొదటి 40 ఏళ్లు ఒక ఎత్తయితే ఈ అయిదేళ్లు ఒకెత్తు. ఈ విషయం చంద్రబాబే స్వయంగా అసెంబ్లీ సాక్షిగా ఎన్నోసార్లు చెప్పారు. గతంలో ఆయన మహా మహా నాయకులను ఢీకొట్టారు. గెలుపోటములు రాజకీయాల్లో సహజం. గెలిచిన పార్టీ నాయకులు ఓడిన నాయకులను విమర్శించడం, ప్రతిపక్షం సైతం అధికార పక్షంపై రాజకీయ విమర్శలు చేయడం సహజం. కానీ జగన్ మార్కు కక్ష సాధింపు రాజకీయం మాత్రం ఆయన ఎదురు చూసింది కాదు. ఎన్నడూ లేనన్ని అవమానాలూ, కక్ష సాధింపులు ఎదుర్కొన్నారు. టీడీపీ నాయకుల ఆర్థిక మూలాల్ని దెబ్బతీశారు. ఆత్మస్థైర్యాన్ని నీరుగార్చారు. అక్రమ కేసులు బనాయించారు. భౌతిక దాడులు, హింస యథేచ్ఛగా సాగాయి. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగినా అప్పటి ప్రభుత్వం ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. ఏకంగా చంద్రబాబు ఇంటిపైనకు ఓ నేత మందీ మార్బలంతో దండెత్తినా చర్యల్లేవు. చంద్రబాబుపై, తెదేపా నాయకులపై వైసీపీ నాయకులు వెకిలి మాటలతో రెచ్చిపోతోంటే నిలువరించాల్సిన జగన్ అసెంబ్లీలో వారిని నవ్వుతూ ప్రోత్సహించారు. చివరికి తన భార్య వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడేసరికి చంద్రబాబు తట్టుకోలేక పోయారు. తిరిగి ముఖ్యమంత్రయ్యాకే అసెంబ్లీకొస్తానంటూ శపథం చేసి బయటకు వచ్చారు. మీడియా సమావేశంలో ఎప్పుడూ హుందాగా ఉండే మనిషి కన్నీటి పర్యంతమయ్యారు. ''పెద్ద పెద్ద నాయకులతో పనిచేశాం. కానీ ఈ రెండున్నరేళ్లలో పడ్డ అవమానాలు ఎప్పుడూ చూడలేదు. వ్యక్తిగతంగా, పార్టీపరంగా అవమానించారు. ఏ పరువు కోసం ఇన్నేళ్లుగా బ్రతికానో... నా కుటుంబం, నా భార్య విషయం కూడా సభలోకి తీసుకొచ్చ దారుణంగా అవమానించారు'' అని భావోద్వేగానికి లోనయ్యారు. 2021 నవంబరు 19వ తేదీన అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడుతూ.. ''నేను స్టేట్మెంట్ ఇవ్వాలంటే కూడా మీరు ఇవ్వనీకుండా చేశారు కాబట్టి.. ముఖ్యమంత్రిగానే మళ్లీ ఈ హౌస్‌కొస్తా. లేకపోతే నాకీ రాజకీయాలు అవసరంలేదు. ఇదొక కౌరవ సభ. గౌరవ సభ కాదు. ఇలాంటి కౌరవ సభలో నేనుండనని మరొక్కసారి విజ్ఞప్తి చేస్తూ మీకు నమస్కారం. నాకు జరిగిన అవమానాన్ని ప్రజలంతా అర్థం చేసుకుని నిండు మనసుతో ఆశీర్వదించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నా''అని తన పార్టీ నాయకులతో అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. తిరిగిఇన్నాళ్ల తరువాత ఆయన ముఖ్యమంత్రిగా అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నారుఅసెంబ్లీలో శపథం అనంతరం సైతం చంద్రబాబు పార్టీని, క్యాడర్ ని నిలబెట్టుకునేందుకు ఎంతో శ్రమించారు. రాష్ట్రమంతటా సభలు, సమావేశాలతో పార్టీ కార్యకర్తల్లో ఉత్తేజం నింపారు. నవయువకుడిలా రాష్ట్రంలో ఎక్కడ సమస్య జరిగినా ఎలుగెత్తి చాటారు. అమరావతిపై పోరాడారు. జంగారెడ్డి గూడెంలో నాటు సారా మరణాలపై గళమెత్తారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారు. ఈ క్రమంలోనే తాను ఏదైతే జీవితంలో చూడకూడదనుకున్నారో అది కూడా చూశారు. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో ఎ37 గా ఆయన్ని అరెస్టు చేయడంతో 53 రోజులు జైలు జీవితం సైతం గడిపారు. అక్కడి నుంచే పార్టీకి ఆదేశాలిస్తూ కుమారుడు లోకేష్ సాయంతో కార్యక్రమాలు రూపొందించారు. ఏపీ హైకోర్టు ఆరోగ్య కారణాల దృష్ట్యా మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో బయటకు వచ్చారుజనసేన, భాజపాతో కలిసి 164 స్థానాలతో చరిత్రలో లేని విజయం సొంతం చేసుకుని, జగన్ పార్టీకి ప్రతిపక్ష హోదా సైతం లేకుండా చేసి సింహంలా అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు చంద్రబాబు. అయితే తాను జైలులో ఉన్న సమయంలో తనకు జనసేన అధినేత పవన్ అండగా నిలిచిన తీరుని చంద్రబాబు మరువలేదు. ఇప్పటికీ చంద్రబాబు పలు సందర్భాల్లో పవన్ తనకు, పార్టీకి నైతిక స్థైర్యం ఇచ్చిన సంగతి పలు సందర్భాల్లో ప్రస్తావించారు. అధికారంలోకి వచ్చిన తరువాత సైతం ఆయనకు తన ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించారు. అంతే కాకుండా తన ఫొటోతో పాటు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ పవన్ ఫొటో కూడా ఉండాలని ఆదేశించి తన మనసులో పవన్ స్థానమేంటో చూపించారు.

# సింగరేణి అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా?

- కాంగ్రెస్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్
- సికాంగరేణిని ప్రైవేటీకరించి దివాళా తీయించింది కేసీఆరే
- సింగరేణిలో కేంద్రం వాటా 49, రాష్ట్రం వాటా 51 శాతం మాత్రమే
- రాష్ట్ర ఆమోదం లేకుండా కేంద్రం ప్రైవేటీకరించడం అసాధ్యం
- తప్పడు ప్రచారంతో ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర
- అవినీతి విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది
- ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం విచారణ పేరుతో జాప్యం చేయడమే తప్ప చేసిందేమీ లేదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- ప్రధాని కృషి వల్లే యోగాను అంతర్జాతీయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వెల్లడి

**కరీంనగర్ - ప్రభాత సూర్యుడు**



సింగరేణిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అంటూ కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీబీఐ విచారణ జరిపితే గత ప్రభుత్వ నిర్వాకాలతోపాటు సింగరేణి దుస్థితికి కారకులెవరో తేలిపోతుందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన తరువాత కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మళ్లీ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వ ఆమోదం లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరణ చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు కరీంనగర్ లోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ మున్సిపల్ గ్రౌండ్ లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రధాని నరేంద్రమోదీ క్రుషి వల్లే ఈరోజు అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నం. 2014లో ఐక్య రాజ్యసమితిలో మోదీ మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని అంతర్జాతీయ దినోత్సవంగాప్రకటించాలని ప్రతిపాదించడంవల్లే గత పదేళ్లుగా జూన్21 రోజు అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నాం. అన్ని రోగాలకు పరిష్కారం యోగా. చిన్నా పెద్ద తేడా లేకుండా క్రమం తప్పకుండా యోగా చేయాలి. 'మన శ్రేయస్సుతోపాటు సమాజ శ్రేయస్సు' అనే నినాదంతో ఈసారి యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. సింగరేణిపై తప్పుడు ప్రచారం. ప్రజలను అయోమయం చేసే కుట్ర. మోదీ రామగుండం వచ్చి సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సింగరేణిలో కేంద్రానిది 49 శాతం వాటా మాత్రమే. రాష్ట్రానిది 51 శాతం ఉంది. అట్లాంటప్పుడు రాష్ట్ర అనుమతి లేకుండా సింగరేణి ప్రైవేటీకరించడం ఎట్లా సాధ్యం?
సింగరేణి ఈ దుస్థితికి రావడానికి ప్రధాన కారణం నాటి సీఎం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. తాడిచర్లలో ఏపీ జెన్ కోకు ఇస్తే... కేసీఆర్ ప్రభుత్వం ప్రైవేట్ వాళ్లకు అప్పగించింది నిజం కాదా? సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరించిందే కేసీఆర్. ఆయన మూర్ఖత్వపు ఆలోచనవల్ల సింగరేణిని పూర్తిగా దెబ్బతీశారు. తన కుటుంబానికి ఏటీఎంగా మార్చుకున్నారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ది ఉంటే... సింగరేణి కార్మికుల పట్ల ప్రేమ ఉంటే గతంలో కేసీఆర్ చేసిన అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ము మీకుందా? నిన్న ఓ టీవీ ఛానల్ చర్చలో బీజేపీ ఎస్సీ మోర్చా నేత ఎస్.కుమార్ సింగరేణి అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అని ప్రశ్నిస్తే...కాంగ్రెస్ నేత మాట్లాడుతూ తప్పనిసరిగా సింగరేణిపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాస్తామని చెప్పారు. ఆ మాటకు కట్టుబడి లేఖ రాసే దమ్ముందా?
కేసీఆర్ కుటుంబం స్వలాభం కోసం సింగరేణిలో పొట్టుపొట్టు అవినీతి చేస్తే... కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోంది. కేసీఆర్ సర్కార్ గతంలో నయీం కేసు, మియాపూర్ భూములు, డ్రగ్స్, పేపర్ లీకేజీ వంటి వాటిపై సిట్ వేసి మధ్యలోనే నీరుగార్చారు. కాంగ్రెస్ కూడా అంతే. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం విచారణ పేరుతో జాప్యం చేస్తూ లాభం పొందాలనుకుంటున్నారే తప్ప వేరే ఆలోచనలేదు.. మళ్లీ చెబుతున్నా. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు. అసలు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా సింగరేణిని ప్రైవేటీకరించడం కేంద్రానికి సాధ్యమే కాదు.



# లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్ జూన్ 26న ఎన్నిక

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎంపీ భర్తృహరి మహతాబ్ ఎంపికయ్యారు. స్పీకర్ ఎన్నిక పూర్తయ్యే వరకు లోక్‌సభ ప్రిసైడింగ్ అధికారిగా ఆయన కార్యకలాపాలు నిర్వహిస్తారు. 18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారు. ఆయనకు సహాయంగా ఉండే ఛైర్‌పర్సన్ల ప్యానెల్ లో కె. సురేష్ కాంగ్రెస్, టీఆర్ బాలు, డీఎంకే, రాధా మోహన్ సింగ్, బీజేపీ, ఫగ్గన్ సింగ్ కులస్తే బీజేపీ, సుదీప్ బంధోపాధ్యాయ, టీఎంసీ ఉన్నారు. ఈ వివరాలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడిరచారు. భర్తృహరి మహతాబ్ ఒడిశాలోని కటక్ నుంచి ఏడుసార్లు విజయం సాధించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందే ఆయన బిజూ జనతాదళ్‌ని వీడి బీజేపీలో చేరారు. కటక్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఏడోసారి విజయ దుందుభి మోగించారు. 18వ లోక్‌సభ సమావేశాలు జూన్ 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 24, 25 తేదీల్లో కొత్త సభ్యుల ప్రమా ణస్వీకారం జరగనుంది. జూన్ 26న స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు

# మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి - ప్రభాత సూర్యుడు**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో 8 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మున్సిపల్ పరిపాలన భవనాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన జాతీయ జెండా స్తంభం, మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించారు. రెండు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన గద్దర్ మల్టీపర్పస్ ఆడిటోరియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గ అభివృద్ధికి అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. ఈదులనాగుల పల్లి, న్యూ యంఐజీ కాలనీ మధ్య కనెక్టివిటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరలో చేపడతామన్నారు. తెల్లాపూర్ మునిసిపాలిటీ లో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం 15రోజుల్లో మొదలు పెడతామని హమీ ఇచ్చారు. చెరువులను, కుంటలను కాపాడుకోవాలి.. ప్రకృతిని రక్షించుకోకపోతే భవిష్యత్తు తరాలకు మనుగడ ఉండదని హితవు పలికారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపట్టే ప్రతిపనిలో ప్రజలు సహకరించాలని కోరారు.. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యులు యంపి రఘునందన్ రావు మాట్లాడుతూ..తెలంగాణ పురం శాసనం ద్వారా తెల్లాపూర్ కు ఎంతో చారిత్రాత్మక నేపథ్యం ఉందని, తెలంగాణపురం అనే పేరును పెట్టే అంశంపై ప్రభుత్వం పరిశీలించాలని డిమాండ్ చేశారు. .తెల్లాపూర్ అండర్ పాస్ రైల్వే బ్రిడ్జిని పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో , జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**సభలో ఉండకుండా ఛాంబర్ కు వెళ్ళిపోయినా మాజీ సీఎం**

**అమరావతి - ప్రభాత సూర్యుడు**



వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణం చేసిన అనంతరం జగన్ సభలో ఉండకుండా ఛాంబర్ కు వెళ్లిపోయారు. అంతకుముందు అసెంబ్లీ వెనుక గేటు నుంచి ప్రాంగణంలోకి జగన్ వచ్చారు. గతంలో ఆయన సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి మందడం మీదుగా సభకు వచ్చేవారు. అమరావతి రైతులు నిరసన తెలుపుతారని భావించి వేరే మార్గంలో సభకు వచ్చినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ప్రాంగణంలోకి వచ్చినా ఆయన లోపలికి వెళ్లలేదు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల తర్వాత వెళ్లారు. తన ప్రమాణస్వీకార సమయం వచ్చినపుడే సభలో అడుగు పెట్టారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/ HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215